

'జునోసిస్'తో జాగ్రత్త

కుక్కలు, ఇతర జంతువులను పెంచుకునే వారు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



ప్రైవేట్ నుంచి ప్రభుత్వంలోకి..

ఏళ్ల తరబడి వైరా ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన కేటీసీఎం సొసైటీ రూ.కోట్ల విలువైన భూమి, భవనాలను ప్రభుత్వానికి అప్పగించింది. 8లో



వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కురిసే అవకాశముంది. చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

నోటీసులు.. రికవరీ



ఏ ఆధారం లేని వారికి అందాల్సిన చేయూత పింఛన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల నుంచి జిల్లా వ్యాప్తంగా 227 మందికి నోటీసులు ఇచ్చారు. ఇన్నాళ్లు తీసుకున్న పింఛన్ నగదు తిరిగి చెల్లించకపోతే సర్వీసు పింఛన్ కూడా నిలిపేస్తామని నోటీసులో పేర్కొన్నారు. పింఛన్ పేరిట రూ.1.50కోట్లు స్వాహా అయినట్లు తెలుస్తుండగా ఇప్పటివరకు ఏడుగురు రూ.3.41 లక్షలు తిరిగి ఇచ్చేశారు. అలాగే, మరికొందరు రెండేసి పింఛన్లు తీసుకుంటున్నారని, కొందరు ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సైతం చేయూత పింఛన్ లబ్ధిదారులుగా ఉన్నారని అధికారులు గుర్తించారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



పింఛన్ అందుకున్న రిటైర్డ్ ఉద్యోగులకు నోటీసులు

- జిల్లాలో 227 మందికి జారీ చేసిన అధికారులు
- రూ.1.50 కోట్లలో రూ.3.41 లక్షలు రికవరీ
- పింఛన్లలో జాబితాలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు సైతం
- మరో 90 మంది రెండేసి పింఛన్లు అందుకుంటున్నట్లు గుర్తింపు

చెల్లించకపోతే సర్వీస్ పింఛన్ కట్

చేయూత పింఛన్లు పక్కదారి పట్టినట్లు తేలడంతో ప్రాథమిక విచారణ అనంతరం సెర్ప్ ఉన్నతాధికారులు ఇటీవల అన్ని జిల్లాలకు జాబితాలు పంపారు. మున్సిపాలిటీలు, మండలాల వారీగా చేయూత పింఛన్లు అందుకున్న రిటైర్డ్ ఉద్యోగుల పూర్తి వివరాలు అందడంతో క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం వారికి నోటీసులు జారీ చేశారు. చేయూత పింఛన్ చెల్లించకపోతే సర్వీసు పింఛన్ నిలిపివేస్తామని పేర్కొంటూ జిల్లాలో 227 మందికి నోటీసులు అందాయి. దీంతో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నలుగురు, కామేపల్లి, ఎర్రుపాలెం, వైరా మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున కలిపి రూ.3.41లక్షలు చెల్లించారు. మిగతా వారు వారంలోగా చెల్లించకపోతే వారిపై చర్యలకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

డబుల్ పింఛన్ నిలిపివేత

జిల్లాలో 90 మంది రెండేసి పింఛన్లు తీసుకుంటున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. ఫైలేరియా, ఏఆర్టీ, డయాలసిస్, వితంతు, వృద్ధాప్య.. ఇలా ఒక కేటగిరీకి బదులు రెండేసి కేటగిరిల్లో వారు పింఛన్ తీసుకుంటున్నట్లు తేలింది. దీంతో వీరికి రెండు నెలల నుంచి పింఛన్ మొత్తం నిలిపివేయగా ఎంపీడీఓ, డీఆర్డీఓ కార్యాలయాల బాట పట్టారు. ఈనేపథ్యాన ఇన్నాళ్లు తీసుకున్న రెండేసి పింఛన్లలో ఒక దానికి నగదు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించగా, అలా చెల్లించిన వారికి త్వరలో పింఛన్ మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

దివ్యాంగ ఉద్యోగులు కూడా..

దివ్యాంగుల కేటగిరీలో ప్రభుత్వం ఉద్యోగం సాధించిన పలువురు కొన్నేళ్లుగా చేయూత పింఛన్ తీసుకుంటున్నట్లు డీఆర్డీఓ అధికారులు తేల్చారు. త్వరలోనే నోటీసులు జారీ చేసి చేయూత పింఛన్ సొమ్ము రికవరీకి సిద్ధమవుతున్నారు. ఈ జాబితాలో పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారని సమాచారం. ఇలా మొత్తం ఎందరు ఉన్నారో తేలాక సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

యాప్‌లో పొందుపర్చడంతో బయటకు..

గత ప్రభుత్వం 2021లో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో ఆధార్ నంబర్ నమోదు చేయగానే సదరు వ్యక్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏయే పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారో తెలిసిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నారా, లేదా అనేది కూడా తేలిపోతుంది. ఈ నేపథ్యాన చేయూత పింఛన్ పొందుతున్న వారి ఆధార్ నంబర్లను సెర్ప్ ఉద్యోగులు యాప్‌లో పొందుపరచడంతో అనర్హుల పేర్లు బయటపడ్డాయి. ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులతో పాటు రెండేసి పింఛన్లు పొందుతున్న వారి జాబితాను సెర్ప్ ఉన్నతాధికారులు పంపించగా జిల్లాలో నోటీసులు జారీ చేసి రికవరీపై దృష్టి సారించారు.

ఓటమి విజయానికి నాంది కావాలి



గ్రంథాలయంలో నిరుద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధమైతే ఫలితం
- లైబ్రరీలో నిరుద్యోగులతో కలెక్టర్ ముజమ్మిల్ ముఖాముఖి

ఖమ్మంగాంధీచౌక్: ఓటమిని విజయానికి నాందిగా మలుచుకోవాలే తప్ప కుంగిపోవద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల సిలబస్‌ను అనుకరించాలని తెలిపారు. ఒకరికొకరు తెలిసిన విషయాలను పంచుకోవాలని తెలిపారు. కుటుంబ బాధ్యతలు, చదువును సమాంతరంగా నిర్వర్తించాలని, నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పరిస్థితులు అడ్డంకిగా మారినా లక్ష్యాన్ని విస్మరించొద్దని తెలిపారు. మానసికంగా దృఢంగా ఉంటే సమస్యలను తేలిగ్గా అధిగమించవచ్చని చెప్పారు. కాగా, గ్రంథాలయంలోని పలు సమస్యలను నిరుద్యోగులు వెల్లడించగా వాటిని పరిష్కరించడమే కాక కావాల్సిన పుస్తకాలు తెప్పిస్తామని భరోసా కల్పించారు. అలాగే, కొన్నాళ్ల కూలిపోయిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

విద్యార్థుల ప్రమాణాల పెంపునకు కృషి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఎంఈఓలు, హెచ్ఎంలతో సమావేశమై మాట్లాడుతూ సమాజ నిర్మాతలను తయారుచేసే బాధ్యత విద్యాశాఖపై ఉందని తెలిపారు. పిల్లల జీవితాన్ని మార్చేందుకు ఉన్న ఏ అవకాశాన్ని వదలొద్దని చెప్పారు. చదువులో వెనుకబడుతున్న విద్యార్థుల సమస్యలను గుర్తించి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తరగతులు, పాఠశాలల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేస్తే ఈ విషయంలో ఫలితం ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో బేస్ లైన్ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా బోధించాలని చెప్పారు. అలాగే, ప్రజలంతా తమను గమనిస్తున్నారని గుర్తించి ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ కె.భూలక్ష్మి, డీసీఈబీ కార్యదర్శి జి.నారాయణ, ఏఎంఓ రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీ ఏర్పాటుకు అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

- ఇప్పటికే 20వేల దరఖాస్తులు
- అధికారులతో సమీక్షించిన డీఆర్‌డీఓ సన్యాసయ్య

బోనకల్: మధిర నియోజకవర్గంలోని పాడిరైతుల ఆర్థికాభివృద్ధి కోసం బోనకల్ మండలంలో ఇందిరా డెయిరీ ఏర్పాటుచేయాలని నిర్ణయించగా ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా నియోజక స్థాయి పశుసంవర్ధక శాఖ, ఐకేపీ శాఖల ఉద్యోగులతో శుక్రవారం బోనకల్‌లోని ఐకేపీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఏ ఆర్.సన్యాసయ్య సమావేశమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాడి పశువులు, పాడి రైతులు పాలను ఎక్కడ విక్రయిస్తున్నారనే అంశాలపై సమీక్షించి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ డెయిరీలో సభ్యులుగా చేరేందుకు ఇప్పటికే 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పాడి పశువుల కొనుగోలుపై 70శాతం రాయితీ ఇవ్వనుండగా అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపాన గతంలో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు సేకరించిన స్థలాన్ని డీఆర్‌డీఓ పరిశీలించారు. ఈ సమావేశంలో ఏపీడీ నూరుద్దీన్, వెటర్నరీ ఏడీ పండరీబాబు, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రాజు, వివిధ శాఖల ఉద్యోగులు దర్గయ్య, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, రేవతి, పద్మ, పద్మలత, రాంబాబు, వెంకటేశ్వర్లు, తిరుమలరావు, కల్పన, ఇందిరా డెయిరీ పాలకవర్గ బాధ్యులు అన్నపూర్ణ, రమణ, లలిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ కార్యాలయ భవనాలు పరిశీలన

మధిర: మధిర మండలం ఎండపల్లి గుట్టల వద్ద ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా ఐటీ హబ్ ఏర్పాటుచేస్తామని తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో తాత్కాలికంగా హబ్ ఏర్పాటుకు అనువైన భవనాల కోసం అధికారులు ప్రారంభించారు. పట్టణంలోని పలు భవనాలను శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన పరిశీలించి వివరాలు సేకరించారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, నాయకులు పారుపల్లి విజయ్, రంగా శ్రీనివాసరావు, పల్లపోతుల ప్రసాదరావు పాల్గొన్నారు.

రెండోరోజూ అదే పరిస్థితి



ఓపీ నమోదు విభాగం వద్ద బారులుదీరిన జనం

కార్మికుల సమ్మెతో ఖమ్మం పెద్దాస్పత్రిలో ఇక్కట్లు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. నాలుగు నెలల జీతాలు చెల్లించే వరకు విధుల్లో చేరే ప్రసక్తి లేదని వారు స్పష్టం చేస్తుండగా.. ఆస్పత్రిలో సేవలకు ఆటంకం ఎదురవుతోంది. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పేషంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్లు 259 మంది పనిచేస్తుండగా వారికి నాలుగు నెలల వేతనాలు అందాల్సి ఉంది. దీంతో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ నేపథ్యాన పేషంట్ కేర్ సేవలకు అర్హుల్లో కొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తుండగా వీరి సేవలు వినియోగించుకున్నారు. ఫలితంగా ఓపీ నమోదుకు ఇక్కట్లు ఎదురయ్యాయి. కొందరు తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసినా వారికి అనుభవం లేక జనం బారులుదీరారు. అలాగే, సెక్యూరిటీ సిబ్బంది లేక వైద్యుల వద్దకు వెళ్లే క్రమంలో నియంత్రణ కరువైంది. అంతేకాక వివిధ సమస్యలతో వచ్చిన వారిని బంధువులే వీల్‌చైర్, స్ట్రెచర్లలో తీసుకెళ్లాల్సి వచ్చింది. మరోపక్క పేషంట్ కేర్ కార్మికులు లేక అత్యవసరమైనవి తప్ప ఇతర ఆపరేషన్లు నిలిపివేశారు. అంతేకాక చెత్తాచెదారం, మెడికల్ వేస్ట్ తరలించక, మరుగుదొడ్లు శుభ్రం చేయక ఆస్పత్రి దుర్గంధం వెదజల్లుతోంది. కాగా, శుక్రవారం కార్మికసంఘాల నాయకులు విష్ణువర్ధన్, రామయ్యతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ చర్చలు జరిపి కార్మికులకు మూడు నెలల జీతం చెల్లిస్తామని తెలిపారు. అయితే, అకౌంట్లలో నగదు జమ అయ్యాకే విధుల్లోకి వస్తామని వారు తేల్చిచెప్పారు. ఈ మేరకు కార్మికులకు శనివారం వేతనం జమ చేస్తామని సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు.

బొగ్గు వేలం ఆపే వరకు పోరాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీల ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని వామపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇందులో భాగంగానే కార్పొరేట్ శక్తులకు అప్పగించిన ఖనిజ సంపదను అప్పగించేందుకు బొగ్గు బ్లాక్‌ల వేలానికి సిద్ధమైందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి నిర్వీర్యం కాగా.. కేంద్రం విధానాలతో మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ఇకనైనా వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని బొగ్గు గనులను సింగరేణిని అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతామహాలక్ష్మి, దండు ఆదినారాయణ, ఏపూరి రవీంద్రబాబు, శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ఎనికి సైదులు, శ్రీనివాస్, బి.యాకయ్య, మీరా, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా 'కొత్వాల'



కొత్వాలను సత్కరిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్, తదితరులు

ఖమ్మంవ్యవసాయం : రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల శేషగిరిరావుపై కొన్నాళ్ల కిందట అనర్హత వేటు పడగా, వైస్ చైర్మన్ శ్రీనివాసరావుకు పదవి అప్పగించారు. కాగా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గానూ శేషగిరిరావు ఇటీవల మృతి చెందడంతో కొత్వాలను నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించగా మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ సత్యనారాయణరెడ్డి తదితరులు సత్కరించారు. కాగా, తన నియామకానికి సహకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి : పీఓ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం జన్‌ధన్‌లో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో మిగిలిన కుటుంబాలను వివరాలు సేకరించాలని, తద్వారా ఆయుష్మాన్ భారత్ కార్డులు మంజూరవుతాయని తెలిపారు. అలాగే, ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో మొక్కలు నాటాలని, కొత్తగా టైంటేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకే తరగతులు ముగుస్తున్నందున సాయంత్రం వరకు పిల్లలను చదివించడానికి సబ్జెక్టు టీచర్ల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే, గిరిజన గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు ఎదురవుతున్న అడ్డంకులపై వివరాలు సమర్పించాలని తెలిపారు. ఇక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున 24 గంటల పాటు ఏఎన్ఎం విధుల్లో ఉండాలని పీఓ స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, వెంకటేశ్వరరాజు, నరేశ్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు

కూసుమంచిలో ఈ ఏడాది నుంచే తరగతులు



రెవెన్యూ అకాడమీ భవనంలో శుభ్రం చేస్తున్న కూలీలు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ కళాశాల ఏర్పాటుచేయాలని కొన్నేళ్లుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతుండగా ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఈ విషయాన్ని ఇటీవల విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఏప్రిల్‌లో ఎన్‌ఓసీ విడుదల కాగా, ఈనెల 2వ తేదీన కూసుమంచి మండల పర్యటనకు వచ్చిన మంత్రి అధికారులతో సమీక్షించారు. అంతేకాక నిరుపయోగంగా ఉన్న రెవెన్యూ అకాడమీ భవనాన్ని కూడా పరిశీలించి కళాశాల నిర్వహణకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈమేరకు భవనాన్ని శుభ్రం చేయించి అవసరమైన మరమ్మతులు చేపట్టడమే కాక రంగులు వేయించాలని నిర్ణయించారు. శుక్రవారం మొదలైన పనులను పూర్తి చేస్తామని అధికారులు చెబుతుండగా, ఆలోగా కళాశాల నిర్వహణకు అనుమతులు వస్తే ఈ విద్యాసంవత్సరమే తరగతులుప్రారంభించే అవకాశముంది.

స్వర్ణకవచధారుడైన రామయ్య

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

9 నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి వైకల్య నిర్ధారణపై సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెల 9వ తేదీ నుండి సదరమ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 9, 16, 23, 30, ఆగష్టు 6, 13, 20, 27, సెప్టెంబర్ 3, 10, 17, 24వ తేదీలో క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగే క్యాంపునకు హాజరయ్యేందుకు దివ్యాంగులు మీ సేవా సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్‌కార్డ్ జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు మెడికల్ రిపోర్టులతో రావాలని తెలిపారు.

యూపీఎస్‌సీ సీ శాట్ పరీక్షకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన నిర్వహించే ప్రిలిమినరీ, మెయిన్స్‌కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 10వ తేదీలోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 21న ప్రవేశపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఏదైనా విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పది నెలల శిక్షణకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం 040-23546552, 81216 26423 నంబర్లను సంప్రదించాలని డీడీ సూచించారు.

మాజీ డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు సస్పెండ్

- పదోన్నతుల్లో అక్రమాలపై చర్యలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారిగా విధులు నిర్వర్తించిన బి.వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. కొందరు ఉద్యోగులకు అక్రమంగా పదోన్నతులు ఇచ్చిన విషయమై ఆయన ప్రమేయం ఉన్నట్లు తేలడంతో సస్పెండ్ చేస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన సమయాన వెంకటేశ్వర్లు 2018లో ఏడుగురికి పదోన్నతి కల్పించారు. ఇందులో ఐదుగురికి అర్హత లేకున్నా నాలుగేళ్లలో డిగ్రీ పూర్తిచేయాలనే నిబంధనతో పదోన్నతి ఇస్తే ఎవరూ పూర్తిచేయలేకపోయారు. దీంతో వారు పాత స్థానాలకు వెళ్లాల్సి రాగా.. అప్పటికే ఆ స్థానాలు భర్తీ అయ్యాయి. ఈక్రమంలో కొందరు కోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన అధికారులు అప్పట్లోనే పలువురిని సస్పెండ్ చేశారు. తాజాగా నియామకాలకు డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లును ప్రధాన బాధ్యుడిగా చేస్తూ వేటు వేశారు. అయితే, డీసీహెచ్ఎస్‌గా ఇటీవలే వెంకటేశ్వర్లు స్థానంలో రాజశేఖర్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు.

ఏఎస్సై కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు



చెక్కు అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఇటీవల మృతి చెందిన మధిర రూరల్ ఏఎస్ఐ జి.వెంకన్న కుటుంబసభ్యులకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేశారు. రూ.8లక్షల చెక్కు అందజేసి సీపీ మాట్లాడుతూ ఏఎస్సై కుటుంబానికి శాఖాపరంగా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వాన

- కొణిజర్లలో 3 సెం.మీలకు పైగానే వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 7గంటల సమయాన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాన రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. కొణిజర్ల, ముదిగొండ, చింతకాని, నేలకొండపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, ఖమ్మం, వైరా, మధిర, వేంసూరు, బోనకల్, తిరుమలాయపాలెం, తల్లాడ మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కొణిజర్ల మండల కేంద్రంలో అత్యధికంగా 30.3 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, ముదిగొండ మండలం పమ్మిలో 24.3, చింతకానిలో 23.8, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 21.3, నేలకొండపల్లిలో 16.5, ముదిగొండలో 16.0 మి.మీ., బాణాపురంలో 14.8, ఖమ్మంలోని ప్రకాష్‌నగర్‌లో 11.8, నాగులవంచలో 10.3 వర్షపాతం నమోదైంది. ఇక ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో రహదారులపైకి వరద చేరగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అయితే, ఈ వర్షంతో పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనంద పడుతున్నారు. కాగా, మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

జునోసిస్ వ్యాధులతో జాగ్రత్త

మూగజీవాలపై నానాటికీ సమాజంలో ప్రేమ పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఇళ్లలో శునకాలు, ఇతర జీవాలను పెంచుకునే వారి సంఖ్య ఎక్కువేనని చెప్పాలి. కొందరు ప్రేమతో.. ఇంకొందరు స్టేటస్ సింబల్‌గా వీటిని పెంచుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా జీవాల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకున్నా.. సరైన అవగాహన లేకున్నా వ్యాధులు సంక్రమించే ముప్పు పొంచి ఉన్నట్లే. ఈ నేపథ్యాన జీవాలకు వ్యాక్సిన్లు ఇప్పించడంతో పాటు ఇతర జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు (శనివారం) ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా కథనం.

– ఖమ్మంవ్యవసాయం/ భద్రాచలంఅర్బన్



జాగ్రత్తలు తప్పనిసరి

సమాజంలో జంతు ప్రేమ రోజురోజుకూ పెరుగుతోంది. అయితే, జీవాల పెంపకంపై దృష్టి సారిస్తున్న వారు వాటితో వచ్చే వ్యాధులను పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యాన ప్రధానంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయాన ఇతరులపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి. అంతేకాక పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పక చేయించాలి. అలాగే, పెంపుడు జంతువులు, కోళ్లతో సన్నిహితగా మెలిగే వాళ్లు సైతం వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- జంతువుల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- అవగాహన, వ్యాక్సినేషన్ తప్పనిసరి అంటున్న వైద్యులు
- లేకపోతే వైరస్, బ్యాక్టీరియాల ద్వారా వ్యాధుల వ్యాప్తి

నేడు ప్రపంచ జునోసిస్ డే

ఏటా జూలై 6న..

జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సోకే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి టీకా వేసి పునర్జన్మ ప్రసాదించిన సందర్భంగా ఏటా ఇదే రోజు జునోసిస్ డేగా నిర్వహిస్తున్నారు. జునోసిస్ వ్యాధుల్లో 200 రకాలు ఉన్నట్టు గుర్తించగా.. మొత్తం అంటువ్యాధుల్లో ఇవే 60 శాతమని అంచనా. ఇక రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జునోసిస్ వ్యాధులపై అవగాహన కలిపిస్తోంది. అంతేకాక పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తారు.

ప్రధానంగా వ్యాపించే వ్యాధులు

జునోసిస్ వ్యాధుల్లో పలు రకాలు ఉన్నాయి. ఇందులో ప్రధానమైనది రేబిస్. పిచ్చికుక్క కాటు ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి లక్షణాలు కుక్క కరిచాక వారం నుంచి పది రోజుల్లో కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన వారు గుటక వేయలేకపోగా, దాహం వేస్తున్నా నీళ్ల తాగమంటే భయపడతారు. ఈ మేరకు కుక్క కరిచిన వెంటనే ఆ భాగాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి తగు చికిత్స చేయించుకోవాలి. అలాగే, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయిస్తే ఇబ్బంది ఉండదు. ఇక రేబిస్, జపనీస్ ఎన్సెఫిలైటిస్ (మెదడువాపు), వైరల్ హైపటైటిస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర, ఆంత్రాక్స్ తదితరాలు సైతం జునోసిస్ వ్యాధుల జాబితాలో ఉన్నాయి.



పెంపుడు కుక్కతో చిన్నారులు

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడువాపు వ్యాధుల విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ఇంట్లో కుక్కలు పెంచే వారు వ్యాక్సిన్ తప్పనిసరి వేయించాలి.

– డాక్టర్ పురందర్, భద్రాద్రి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

వ్యాధులను నివారించవచ్చు..



జునోసిస్ వ్యాధులు చాలా రకాలు ఉన్నా చాలా వాటితో ప్రమాదం తక్కువగానే ఉంటుంది. అయితే, ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన అవసరం. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. అలాగే, రక్షిత మంచినీరు, జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పోషిస్తే సమస్యలు రావు

– డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, భద్రాచలం

అజాగ్రత్త వహించొద్దు



జీవాలను పెంచే ప్రతీఒక్కరు జునోసిస్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. తరచుగా వైద్యులను సంప్రదిస్తూ సమయానుగుణంగా జీవాలకు వ్యాక్సిన్లు వేయించాలి. ముఖ్యంగా ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే మరింత జాగ్రత్త వహిస్తే ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ వి.అరుణ, ఏడీ, ఖమ్మం పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

ప్రైవేట్ నుండి ప్రభుత్వంలోకి...

- 14.4 ఎకరాల భూమి అప్పగిస్తూ కేవీసీఎం సొసైటీ నిర్ణయం
- గురుకులం లేదా అంతర్జాతీయ స్థాయి పాఠశాల ఏర్పాటుకు సన్నాహాలు
- 1952 నుండి వైరా ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి



కేవీసీఎం సొసైటీ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తదితరులు (ఫైల్)



కేవీసీఎం సొసైటీ స్థలంలోని భవనాలు

వైరా: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం నలభై ఏళ్ల క్రితం వైరాకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆంధ్రానికేతన్ పేరుతో పాఠశాల ఏర్పాటు చేశారు. ఆపై వైరాలో కొండబోలు వెంకయ్య చౌదరి మెమోరియల్(కేవీసీఎం) ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో డిగ్రీ వరకు బోధించే స్థాయికి ఎదిగింది. ఇందుకోసం ఏర్పాటుచేసిన సొసైటీ నేతృత్వాన పాలిటెక్నిక్ కళాశాలను కూడా ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా కళాశాల నిర్వహణ నిలిచిపోవడంతో సొసైటీ పరిధిలో ఉన్న రూ.కోట్ల విలువైన భూములు, భవనాలను ప్రభుత్వానికి అప్పగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలలు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు నేపథ్యాన సొసైటీ పరిధిలోని 14.4 ఎకరాల భూమిని అప్పగిస్తూ ప్రభుత్వానికి లేఖ అందజేశారు.

నిరుపేద విద్యార్థులకు తోడ్పాటు

1952లో మధిర ఎమ్మెల్యేగా ఉన్న సోమవరం గ్రామానికి చెందిన కొండబోలు వెంకయ్య చౌదరి ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం ఆంధ్రానికేతన్ పేరుతో పాఠశాల ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. అప్పట్లో 17 ఎకరాల భూమిని సేకరించి పాఠశాల నిర్వహించారు. ఆతర్వాత 1992లో కేవీసీఎం ఎడ్యుకేషన్ సొసైటీగా మార్చి మధిర మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు, చింతనిప్పు నర్సయ్య, తమ్మినేని వీరభద్రం, టీఎస్.ప్రసాద్ సభ్యులుగా కొనసాగారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిగ్రీ విద్యనందించేందుకు కళాశాల ఏర్పాటు చేశారు. అప్పటి నుండి కళాశాల భవనాల నిర్మాణం, నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరుల సేకరణ, తదితర అంశాల్లో ఎన్నారై అయిన కొండబోలు వెంకయ్య చౌదరి కుమారుడు కొండబోలు రవికుమార్, కొండబోలు సురేష్‌తో ఇతర కుటుంబీకులు శ్రద్ధ కనబరిచారు. ఆపై 2009లో కేవీసీఎం ఎన్నారై పాలిటెక్నిల్ కళాశాలగా రూపుదిద్దుకుంది. అనంతరం కొన్నేళ్లకు కళాశాల నిర్వహణ నిలిపివేశారు.

ఇంటిగ్రేటెడ్ గురుకులాల కోసం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా అన్ని గురుకులాలను ఒకే క్యాంపస్‌లోకి చేర్చి అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టింది. ఈ నేపథ్యాన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాఠశాలలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అంతేకాక వైరా భట్టి విక్రమార్క సొంత మండలమైన వైరాలోనూ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి లభ్యతపై అధికారులు ఆరా తీశారు. ఇంతలోనే కేవీసీఎం ఎడ్యుకేషనల్ సొసైటీ భూములు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నట్లు తెలియగా, ఎన్నారై కొండబోలు రవికుమార్ 14.3 ఎకరాల భూమిని విద్యాపరంగా పేదలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతూ ప్రభుత్వానికి ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్‌కు అంగీకార పత్రం సమర్పించారు. దీంతో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కాగా, రూ.కోట్ల విలువైన భూములు, భవనాలను ప్రభుత్వానికి అప్పగించి దాతృత్వాన్ని చాటుకున్న కొండబోలు రవికుమార్, కుటుంబ సభ్యులను స్థానికులు అభినందిస్తున్నారు.

ఆస్పత్రి కోసం అనుకున్నా...

కేవీసీఎం సొసైటీ ఆధ్వర్యాన ఉన్న భూములు, భవనాలు విద్యాభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని సభ్యులు తీర్మానించారు. అంతేకాక కళాశాల ప్రాంగణంలో ఉన్న మధిర మాజీ ఎమ్మెల్యే కొండబోలు వెంకయ్య చౌదరి విగ్రహాన్ని యథాతథంగా ఉంచాలని కోరారు. ఇటీవల ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తదితరులు కేవీసీఎం ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించి తాత్కాలిక భవనాల్లో 100 పడకల ఆస్పని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ విద్యాపరంగా మాత్రమే వినియోగించాలని సొసైటీ సభ్యులు కోరడంతో ఆస్పత్రి నిర్వహణకు మరో స్థలం చూడాల్సి ఉంటుంది.

విద్యాపరంగా మరింత అభివృద్ధి..



గిరిజన నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం విలువైన సొసైటీ భూములను కొండబోలు వెంకయ్య చౌదరి కుమారులు ప్రభుత్వానికి ఇస్తూ నిర్ణయించారు. తద్వారా వైరాలో అంతర్జాతీయ స్థాయి పాఠశాల ఏర్పాటుకు చకచకా అడుగులు పడనున్నాయి.

– మాలోతు రాందాస్‌నాయక్, ఎమ్మెల్యే, వైరా

సీజనల్ వ్యాధుల నివారణకు కార్యాచరణ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వినోద్

వేంసూరు: సీజనల్ వ్యాధుల వ్యాపించకుండా కార్యాచరణ రూపొందించడమే కాక జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.వినోద్ సూచించారు. వేంసూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయితీ కార్యదర్శులకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రై డే – ఫ్రై డే మొక్కుబడిగా కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామాల్లో ఎక్కడా మురుగు నీరు, వర్షం నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. అలాగే, దోమల నియంత్రణకు రెండు, మూడు రోజులకోసారి ఫాగింగ్ చేయించాలన్నారు. గతేడాది సీజనల్ వ్యాధుల ప్రబలిన గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాలని సీఈఓ ఆదేశించారు. ఈసమావేశంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయలక్ష్మి, డీటీ కరుణశ్రీ, మండల వైద్యాధికారి ఇందుప్రియాంక పాల్గొన్నారు

లాభదాయకంగా వెదజల్లే విధానం



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రవికుమార్

రఘునాథపాలెం: వెదజల్లే విధానంలో వరి సాగు చేస్తే ఖర్చు తగ్గి దిగుబడి విషయంలోనూ రైతులకు లాభదాయకంగా ఉంటుందని వైరా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ పేర్కొన్నారు. రఘునాథపాలెంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వెదజల్లే విధానంలో నీటి అవసరం, కూలీలు, దుక్కి దున్నే ఖర్చు తగ్గి పంట త్వరగా చేతికి అందుతుందని తెలిపారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓలు ఇంటూరి భాస్కరరావు, కిషోర్‌బాబు, ఏఈఓలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యాంపునకు గిరిజన విద్యార్థిని



విద్యార్థిని ఇందుతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

భద్రాచలంటౌన్: గిరిజన విద్యార్థిని క్రీడా ప్రతిభ చాటి జాతీయస్థాయి కోచింగ్ క్యాంపునకు ఎంపికైంది. భద్రాచలంలోని గిరిజన గురుకులంలో పదో తరగతి చదివే పడిగే ఇందు ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెం, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్ తదితర క్రీడల్లో సత్తా చాటింది. నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ (ఎన్ఐడీజేఏఎం)–24కు కోచింగ్ క్యాంపునకు అర్హత పొందింది. దేశంలో ఇలాంటి కోచింగ్ క్యాంపులు ఐదు రాష్ట్రాల్లో నిర్వహిస్తుండగా, భోపాల్ క్యాంపునకు ఇందు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్రం నుంచి అండర్–14 విభాగంలో ఎంపిక కాగా, 15 రోజులపాటు క్యాంపునకు భోపాల్ బయల్దేరి వెళ్లింది. ఇందు హైదరాబాద్‌లో జరిగిన ఈఎంఆర్ఎస్ జాతీయ క్రీడల్లో, ఇంటర్ సొసైటీ లీగ్ క్రీడా పోటీల్లోనూ చాంపియన్‌గా నిలిచింది. విద్యార్థినిని శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అధికారులు టి.వెంకటేశ్వరరాజు, రవికుమార్, ఎం.దేవదాస్ తదితరులు అభినందించారు. కాగా విద్యార్థిని స్వగ్రామం లక్ష్మీదేవిపల్లి గట్టుమల్లె. తల్లిదండ్రులు సత్యనారాయణ, అనిత వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

డయాలసిస్ కోసం వచ్చిన కార్మికుడు మృతి

సింగరేణి మెయిన్ ఆస్పత్రి నిర్వహణ లోపమే కారణమా?



యాకూబ్‌ఖాన్ మృతదేహం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చిన, ఇల్లెందు ఓసీలో పనిచేస్తున్న ఎండీ యాకూబ్‌ఖాన్ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రెండు నెలల కిందట యాకూబ్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. డిశ్చార్జ్ సమయంలో వారంలో మూడు రోజులు కొత్తగూడెంలోని కంపెనీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం స్వయంగా నడుచుకుంటూ వచ్చిన యాకూబ్‌ఖాన్ డయాలసిస్ చేయించుకుంటుండగా అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను క్యాజువాలిటీకి పంపించకుండా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేశారని, దీంతోనే యాకూబ్‌ఖాన్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహాన్ని సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, వీరస్వామి మాట్లాడుతూ.. సింగరేణి ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రైవేట్ వ్యక్తులతో నడిపించడం దురదృష్టకరమన్నారు. డయాలసిస్ సెంటర్లో క్రిటికల్ యూనిట్ లేదని, నెఫ్రాలజిస్ట్ లేకుండా డయాలసిస్ నడిపించటం సరైంది కాదని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగికి సరైన వైద్యం అందించటంలో వైద్యులు విఫలమయ్యారని, సీఎండీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాధ్యులైనవారిపై చర్యలు తీసుకునేంత వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్మికుడి మృతికి డయాలసిస్ సెంటర్ వారే పూర్తి బాధ్యత వహితంచాలని డిమాండ్ చేశారు. కాగా, మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు.

ఈదుల చెరువు శిఖం సర్వే

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంలో ఉన్న ఈదుల చెరువు శిఖం భూములను శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేశారు. ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యాన ఈ సర్వేను జరిగింది. చెరువు శిఖంను కొందరు కబ్జా చేశారని ఫిర్యాదులు అందాయి. దీంతో సర్వే చేపట్టగా, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆర్ఐ తెలిపారు.

16.5కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితులు, గంజాయితో పోలీసులు

బోనకల్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు స్కూటీలపై తరలిస్తున్న నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రావినూతల వేబ్రిడ్జి పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈమేరకు రావినూతల నుండి బోనకల్ వైపు వెళ్తున్న రెండు స్కూటీలపై ఉన్న వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించారు. స్కూటీల సీట్ల కింద దాచిన 16.5 కేజీల గంజాయి లభించగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన చిట్టిప్రోలు వంశీ, ఎండ్రబాల వెంకట సత్యసాయి, కోటా జాన్‌వెస్లీ, ఆపిసా నర్సింహ ఒడిశా రాష్ట్రంలోని కిండికొడెం నుండి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు తేలింది. దీంతో గంజాయి, వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న భారత్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా పరిధి సాయిగణేష్‌నగర్‌కు చెందిన బాలుడు భారత్‌రెడ్డి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని బాలుడి ఇంటిపైకి శుక్రవారం కోతులు రావడంతో అదిలించడానికి కర్రతో వెళ్లాడు. ఆ సమయాన కర్ర హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తాకడంతో షాక్‌కు గురి కాగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు మూడో తరగతి చదువుతున్న భరత్ శరీరం 70శాతం మేర కాలడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇంటికి అతి సమీపాన ఉండమే ప్రమాదానికి కారణమని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు.

భూతగాదాలో గొడ్డలితో దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడులో భూతగాదా విషయమై గొడ్డలితో దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు, దాసరి బొర్రయ్య పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. పొలం గెట్టు రాయి జరగడంతో ఎందుకు జరిపారని బొర్రయ్యను వెంకటేశ్వర్లు అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలై ఘర్షణ పడ్డారు. సమీపంలో ఉన్న వెంకటేశ్వర్లు కుమారుడు సైదులు వెళ్లి ఎందుకు ఘర్షణ పడుతున్నారని ఆరాతీయగా బొర్రయ్య ఆగ్రహంతో వెంకటేశ్వర్లు, సైదులుపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో వీరిద్దరు తీవ్రంగా గాయపడగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మధిర: మధిర–మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి(30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గులాబీ రంగు షర్టు, నీలం రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉండగా, ఆయన కుడి చేతిపై అమ్మ, నాన్న అని పచ్చబొట్టు ఉందని జీఆర్పీ ఔట్ పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కాగా, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మార్చురీకి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోళ్ల ఫారమ్‌లో మోటారు చోరీ

కొణిజర్ల: కోళ్లఫారమ్‌లో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. మండలంలోని పల్లిపాడు సమీపాన షేక్ దర్గావలీ రెండెకరాల భూమిలో కోళ్ల ఫామ్ ఏర్పాటు చేశాడు. ఈనెల 3వ తేదీన హైదరాబాద్ వెళ్లి తిరిగి శుక్రవారం వచ్చేసరికి బోరు వద్ద రూ.25వేల విలువైన 1 హెచ్‌పీ మోటార్ కనిపించలేదు. దీంతో వలీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా

నేడు జిల్లాకు ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రామసహాయం రఘురాంరెడ్డి తొలిసారి శనివారం ఖమ్మం రానున్నారు. పార్లమెంట్ మొదటి విడత సమావేశాల్లో పాల్గొన్నాక ఆయన వస్తున్నారు. ఈమేరకు శనివారం ఉదయం ఆయన 11గంటలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ పెద్దలు, శ్రేణులతో సమావేశమై తన విజయానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలపనున్నారు. ఆతర్వాత ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని నివాసానికి చేరుకుంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు ఇవ్వనున్నట్లు పాలేరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి పి.అపర్ణ తెలిపారు. మామిడి, నిమ్మ, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలంతో పాటు అరటి సాగు చేసే వారికి 40శాతం, మిరప, కూరగాయలు, పూల తోటలను మల్చింగ్ విధానంలో సాగు చేసే వారికి 2.5 ఎకరాలకు రూ.16వేల రాయితీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అంతేకాక నీటి కుంటల నిర్మాణానికి రూ.75వేల వరకు రాయితీ అందుతుందని తెలిపారు. రైతులు పూర్తి వివరాల కోసం 89777 14104 నంబర్‌లో సంప్రదించాలని అధికారి సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోజ్ తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరవుతారని, ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారితో రాష్ట్ర జట్టును ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు. వివిధ బరువు కేటగిరిల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విధుల్లో చేరిన పశుసంవర్ధక శాఖ జేడీ

ఖమ్మంవ్యవసాయం: ఇన్నాళ్లు సెలవులో ఉన్న జిల్లా పశుసంవర్ధక, పశువైద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు. గత మే నెలలో ఆయన సెలవు వెళ్లగా హన్మకొండ జిల్లా అధికారి కే.వీ.నారాయణకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఈమేరకు విధుల్లో చేరిన వేణుమనోహర్‌రావుకు ఆయన బాధ్యతలు అప్పగించారు.

హైవే హద్దుల ఏర్పాటు అడ్డగింత

రఘునాథపాలెం: నాగపూర్ – అమరావతి హైవే నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు శుక్రవారం హద్దుల నిర్ధారణకు వచ్చారు. మండలంలోని వీ.వీ.పాలెం సాగర్ ప్రధాన కాల్వకు ఎడమవైపు సర్వే చేస్తున్నట్లు తెలుసుకున్న నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉండగా ఎలా సర్వే చేస్తున్నారని నిలదీయడంతో సిబ్బంది వెనుతిరిగారు.

ఎఫ్‌బీఓపై వరకట్న వేధింపుల కేసు

కారేపల్లి: అదనపు కట్నం తీసుకరావాలని భార్యను వేధిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్‌పై కారేపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఫైల్‌తండా గ్రామానికి చెందిన సౌందర్యకు, ఏన్కూర్ మండలం ఎర్రబోడు తండాకు చెందిన ఎఫ్‌బీఓ భూక్యా మల్సూర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని మల్సూర్‌తో పాటు మరో నలుగురు కుటుంబ సభ్యులు సౌందర్యను ఇబ్బంది పెడుతుండగా ఈనెల 2న ఆమెను భర్త తీవ్రంగా కొట్టి గెంటేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో భర్త సహా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

నకిలీ బంగారం ముట్టచెప్పి రూ.5 లక్షలు స్వాహా

నేలకొండపల్లి: అసలు బంగారమని నకిలీది అప్పగించిన ఓ వ్యక్తి రూ.5లక్షలు స్వాహా చేశాడు. నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామానికి ఏపీకి చెందిన బంగారం వ్యాపారి ఇటీవల వచ్చాడు. ఇక్కడ పలువురితో పరిచయాలు ఏర్పడగా గ్రామ యువకుడికి తక్కువ ధరకు బంగారం విక్రయించాడు. అంతేకాక తనకు బంగారం దుకాణం ఉందని... అక్కడికి వస్తే రూ.5లక్షలకే కిలో బంగారం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో సదరు యువకుడు అందిన కాడికల్లా అప్పులు చేసి రూ.5 లక్షలు తీసుకెళ్లి ఆ వ్యాపారికి చెల్లించి బంగారం తీసుకొచ్చాడు. తీరా ఇక్కడకు వచ్చాక అది నకిలీ బంగారమని తేలడంతో లబోదిబోమంటూ ఫిర్యాదు చేసేందుకు ఏపీకి బయలుదేరినట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438